క్లుప్తంగా

రేపు వేమనపై విద్యార్థులకు పోటీలు

ప్రొద్దుటూరు : స్థానిక పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఆదివారం 9 గంటలకు యోగి వేమనపై పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు వేమన సేవా సమితి అధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి గజ్జల వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు వేమన పద్య పఠనం పోటీలు, 6, 7, 8 తరగతుల విద్యార్థులకు వేమన చిత్రలేఖనం పోటీలు, 9, 10 తరగతుల విద్యార్థులకు ఆధునిక సమాజంలో వేమన సాహిత్య ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని వారు వివరించారు. పోటీల విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పర్యవేక్షించారు. జమ్మలమడుగు రోడ్డులోని ప్రధాన కాలువ నుంచి మడూరు ఛానల్ వరకు కాలువలో పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులతో తొలగించారు. కేసన్న సత్రం వీధి, శాస్త్రి నగర్, వైఎస్ నగర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.నూర్ బాషా, మలేరియా మేస్త్రి బిజయ్య పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

చాపాడు: విజయవాడలో ఈ నెల 4, 5వ తేదీలలో జరిగే ప్రపంచ నాస్తిక మహాసభలను విజయవంతం చేయాలని ప్రజానాట్యమండలి నాయకుడు పల్లవోలు రమణ కోరారు. ఈ సభల్లో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో పెంపొందించాలనే అంశంపై డా. బ్రహ్మారెడ్డి, గుజరాత్‌కు చెందిన ప్రొఫెసర్ హిప్పు సాక్ నాథన్ ప్రసంగిస్తారని తెలిపారు. అలాగే మానవ హక్కులు, సెక్యులరిజం, నాస్తిక విలువలు అనే అంశంపై మహారాష్ట్రకు చెందిన డా. శంషుద్దీన్, చండీగఢ్ నుంచి రంజిత్ సింగ్, డా. బెనరీ మాట్లాడుతారని తెలిపారు. ప్రజా స్వామ్యం అనే అంశంపై జీవీవీ డీఎస్ ప్రసాద్, హన్మంతరావు చర్చిస్తారని పేర్కొన్నారు.

ప్రజలు సమగ్ర వివరాలు అందించాలి

చాపాడు: మండల వ్యాప్తంగా ప్రజలందరూ తమ వివరాలను గ్రామ సచివాలయాల్లో తెలియజేయాలని మండల అభివృద్ధి అధికారి వీర కిషోర్ తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామ సచివాలయాల్లో గ్రామ ప్రజలు సమచారంతో కూడిన వివరాలను పొందుతుపరిచారన్నారు. క్యాస్ట్, సబ్ క్యాస్ట్, ఇతర వివరాలను నమోదు చేస్తున్నారని ఇప్పటి వరకూ పొందుపరచిన జాబితా సచివాలయాల్లో ఉందన్నారు. ఇందులో పూర్తి వివరాలు లేని వారందరూ తమ వివరాలను సచివాలయంలో తెలియజేయాలని ఎంపీడీఓ కోరారు.

ఎమ్మెల్సీ నివాళి



చెంచయ్య మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని భావనారాయణనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ డీలర్ జింకాప్రహల్లాద పెద్ద కుమారుడు ప్రకాష్ గురువారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి శుక్రవారం ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రకాష్ మృతి పార్టీకి తీరనిలోటని అన్నారు. పార్టీపరంగా ఆయన కుటుంబ సభ్యులకు అన్నిరకాలుగా అండగా ఉంటామని సూచించడంతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాశ్రీరాములు, మున్సిపాలిటీ నాయకులు నారాయణరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, చెంద్రాయుడు పాల్గొన్నారు.

అట్లూరు: అట్లూరు సర్పంచ్ రేణుకాయల్లమ్మ మామ చెంచయ్య గురువారం రాత్రి అరుందతీవాడలో చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి శుక్రవారం అరుందతీవాడ వెళ్లి చెంచయ్య మృత దేహానికి నివాళులు అర్పించారు. డీఎల్‌డీపీ జిల్లా చైర్మన్ రొండ మాధవరెడ్డి, మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రొండా మల్లికార్జునరెడ్డి, రెడ్డిపల్లి మాజీ సర్పంచ్ లక్ష్మి నరసారెడ్డి, నాయకులు చిన్నసూరారెడ్డి, పొన్నవోలు బ్రహ్మానందరెడ్డి, డీలర్ కృష్ణారెడ్డి, పెంచల్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, శ్యాంసుందర్, రమణయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

తెగులు.. దిగులు



తెగుళ్లతో పూత రాలిపోయిన కందిపంట



మిరప పంటను దున్నేస్తున్న రైతు

- దిగుబడిపై పడనున్న ప్రభావం
- పెట్టుబడైనా వచ్చేనా?
- ఆందోళనలో రైతన్నలు

వ్యవసాయం అంటేనే గాలిలో దీపం వంటి పరిస్థితి. విత్తనం వేసినప్పటి నుంచే రైతులకు ఇబ్బందులు మొదలవుతాయి. ఎందుకంటే వేసిన విత్తనం నాణ్యమైనదేనా.. లేదా? అనేది మొదటి అనుమానం. విత్తనం సరిగా మొలకెత్తుతుందా? లేదా? అనేది మరో అంశం. అన్నీ సక్రమంగా ఉండి మొలకెత్తినా చేను చీడపీడల బారిన పడకుండా ఉంటుందా? అనేది మరో సంశయం. ఇలా పంట చేతికందే దాకా ప్రతీ దశలోనూ రైతులకు ఇబ్బందులు తప్పవు. కొన్ని సార్లు పెట్టుబడి కూడా రాక నష్టాలపాలవుతారు.

కాశినాయన : ఆరుగాలం కష్టించి పనిచేసే అన్నదాతకు అడుగడుగునా అవరోధాలే. ఒక పక్క అతివృష్టి, మరో పక్క అనావృష్టి, చీడపీడలు, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు అన్నదాతను పాతాళానికి తొక్కేస్తున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలను సాగు చేసిన రైతులు తెగుళ్లతో ఆందోళన చెందుతున్నారు. పంట చేతి కొచ్చే దశలో వివిధ రకాల తెగుళ్లు ఆశించడంతో దిగుబడులు తగ్గుతాయని, ఏం చేయాలో అర్థం కావడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్ల నివారణకు వేల రూపాయలు ఖర్చు పెడుతున్నా ఫలితం లేదని వాపోతున్నారు. ముఖ్యంగా పోరుమామిళ్ల వ్యవసాయ డివిజన్ పరిధిలో మిర్చి, సీడ్ మొక్కజొన్న, కంది, పత్తి పంటలకు తెగుళ్లు ఆశించాయి. మిర్చి పంటకు ఎర్రనల్లి తెగులు సోకడంతో ఆందోళన చెందుతున్నారు. దీనినే నల్లతామర అంటారు. ఈ తెగులు సోకిన చెట్టు ఆకు పూర్తిగా దెబ్బతింటుంది. తామరపురుగు పూత, ఆకును తిని వేయడంతో పాటు రసం కూడా పీల్చుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తెగులు ప్రభావంతో మిర్చి తోటలు వెలవెలపోతున్నాయి. ఎకరాకు సుమారు రూ.50 వేలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తే తీరా పిందె, పూతదశకు వచ్చే సమయంలో ఈ తెగులు సోకిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కందిపంటకు తెగుళ్లు

నెల రోజుల నుంచి వాతావరణంలో మార్పుల వలన కందిపంటకు తెగుళ్లు సోకి పూత, పిందె రాలిపోతుంది. అంతేకాకుండా కందిపంటలో గూడు, పచ్చపురుగు వ్యాపించడంతో కందిపంట పూర్తిగా దెబ్బతింది. పంట పూత, కాయదశలో ఉండగా ఈ తెగులు రావడంతో పంట పూర్తిగా దెబ్బతిందని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో ఈ ఏడాది కందిపంటకు మంచి డిమాండ్ ఉంది. పంట పూతలో శనగపచ్చ పురుగు, నల్లి పురుగు, దోమపోటు సోకడంతో పూత రాలిపోయింది. ఎన్ని మందులు పిచికారి చేసినా లాభం లేకుండా పోయిందని అంటున్నారు.

మొక్కజొన్నకు కత్తెర తెగులు

కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు మండలాల్లో దాదాపు వెయ్యి ఎకరాల్లో సీడ్ మొక్కజొన్నను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం పంట రెండు నెలల దశలో ఉంది. మొక్కజొన్న పంటకు కత్తెర తెగులు సోకడంతో పైరు ఎదుగుదల లోపించింది. పురుగు ఆకు మొదట్లో చేరి రసాన్ని పీల్చి ఆకులను తింటుంది. దీని నివారణ కోసం మందులు పిచికారి చేస్తున్నా ఉపయోగం లేకుండా పోయిందని రైతులు చెబుతున్నారు.

మిరపపంటను దున్నేసిన రైతు

మండలంలోని ఆకులనారాయణపల్లె గ్రామానికి చెందిన సాంబయ్య అనే రైతు 7 ఎకరాల్లో మిరప పంటను సాగు చేశాడు. ప్రస్తుతం పంటకు తెగులు సోకడంతో మందులు పిచికారి చేసినా తెగులు నివారణ కాకపోవడంతో 7 ఎకరాల్లో సాగు చేసిన మిరప పంటను ట్రాక్టర్‌తో దున్నేశాడు. దాదాపు రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టానని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

అన్నదాతను ఆదుకోండి

ఖాజీపేట మండల సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం



ఖాజీపేట : అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

ఖాజీపేట : వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి అన్నదాతను ఆదుకోవాలని మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులకు వినతిపత్రం అందించారు. ఖాజీపేట మండల సర్వసభ్య సమావేశం మండల ఉపాధ్యక్షురాలు ప్రశాంతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మృతికి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నివాళి అర్పించారు. అనంతరం సభను కొనసాగించారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఆదుకోవాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తీర్మానం కాపీని కలెక్టర్, వ్యవసాయ శాఖ జేడీకి పంపించారు. ఖాజీపేటలో తరచు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని విద్యుత్ శాఖ ఏఈని ప్రజాప్రతినిధులు నిలదీశారు. స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ త్వరలో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతులు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీలు ఏపీఓకు విజ్ఞప్తి చేశారు.

సభలో గందరగోళం

సర్పంచ్‌లు పనులు చేసిన వాటికి బిల్లులు రావడం లేదని వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. సర్పంచ్‌లు తమ గ్రామాల్లోని పనులు చేయలేకపోతే వారి స్థానంలో ఆ గ్రామంలోని టీడీపీ నాయకులు పనులు చేస్తారని ఎంపీటీసీ చంద్రభాస్కర్ రెడ్డి చెప్పడంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. నిబంధనల మేరకు పనులు అప్పగించడం జరుగుతుందని, బిల్లుల విషయం తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తానని ఎంపీడీఓ దివిజా సంపతి సర్దిచెప్పారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ దవనం పుష్పలత ఎంపీటీలు చంద్రభాస్కర్‌రెడ్డి, బండి శ్రీనివాసులు, కనపర్తి సుబ్బారెడ్డి, ప్రశాంతి, రాముడు, కోఆప్షన్ సభ్యుడు మున్వర్ సర్పంచ్‌లు యన్నం రాణెమ్మ, మీగడ సుస్మిత, వెంకటసుబ్బయ్య, చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, నాగిరెడ్డి తో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి

చాపాడు: కేసీ కెనాల్ సాగునీటిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేస్తే రెండో కారు వరితో పాటు వివిధ రకాలైన పంటలను రైతులను సాగు చేసుకుంటారని దీనిపై సంబంధిత అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతల మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గతేడాది ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు పడినా, కేసీ కెనాల్‌కు సాగునీరు వచ్చినా అతివృష్టి వలన పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. వరి పంట దిగుబడులు తగ్గిపోయి సరైన గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రెండో కారులో పంటలు సాగు చేసుకునేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారని కేసీ కెనాల్ సాగునీటిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఇవ్వాల్సిన ట్రాన్స్‌ఫార్మర్‌లను వారికి ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉప ఎంపీపీ శుభకరుణమ్మ, ఎంపీడీఓ వీర కిషోర్, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఏఓ రామానుజం, డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డి, వ్యవసాయాధికారి మ్యాగీ, వైద్యాధికారులు రాజేష్ కుమార్, ఓబులేసు, ఎంఈఓలు రవిశంకర్, వంశీ కృష్ణ హాజరయ్యారు.

ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్‌కు వినతులు



రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతి పత్రం అందజేస్తున్న చిట్టి బాబు

ప్రొద్దుటూరు : కడప కలెక్టరేట్‌లో శుక్రవారం ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు పట్టణానికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ, యువసేన ఉపాధ్యక్షుడు నారాయణ స్వామి, నాయకుడు నాగేంద్ర కలిసి వినతి పత్రం అందించారు. ఎస్సీ వర్గీకరణ చేసి ఎస్సీ ఉపకులాలకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు.

- కడప కలెక్టరేట్‌లో ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రాను మాలమహాసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూడెం చెరువు సంపత్ కుమార్, ఏపీ రాష్ట్ర మాలమహానాడు రాయలసీమ అధ్యక్షుడు జేష్టాది భాస్కర్ కలిసి ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ వినతి పత్రం ఇచ్చారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

వర్గీకరణ చేపట్టండి

మైదుకూరు : ఎస్సీ వర్గీకరణను చేపట్టాలని ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు విజ్ఞప్తి చేసినట్లు ఎమ్మార్పీఎస్ అనుబంధ ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి కైపు భాస్కర్ శుక్రవారం తెలిపారు. కడప కలెక్టరేట్‌లో కమిషన్‌ను కలిసి సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసి ఎస్సీ వర్గాల్లోని ఉపకులాలకు న్యాయం చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వద్దు

ఎస్సీ వర్గీకరణ వద్దని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వివరించినట్లు మాల మహానాడు యువజన విభాగం అధ్యక్షుడు తీట్ల చిట్టిబాబు శుక్రవారం తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రాను కలిసి వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగానికి పూర్తి వ్యతిరేకంగా ఉందని తెలిపినట్లు వివరించారు. ఆ మేరకు వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

ధర్నాను జయప్రదం చేయండి

మైదుకూరు : ఉపాధ్యాయుల పట్ల కడప జిల్లా డీఈఓ మీనాక్షి అనుచిత వైఖరికి నిరసనగా శనివారం కడపలో ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగే ధర్నాకు ఉపాధ్యాయులంతా తరలిరావాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. మైదుకూరులో శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టపడి విద్యాబుద్ధులు అందించే ఉపాధ్యాయుల ఆత్మ విశ్వాసం దెబ్బతీసేలా డీఈఓ వ్యవహరించడం తగదన్నారు. ఉపాధ్యాయులను వ్యక్తిగతంగా కక్రోడు అంటూ దూషించడం, ఒక ఉపాధ్యాయురాలి పట్ల తూ అంటూ ఉమ్మి వేయడం లాంటి చర్యలు సహించేది లేదని మండి పడ్డారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవం కోసం జరిగే ఈ పోరాటంలో ఉపాధ్యాయులు విరివిగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్, ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఆర్‌జేయూపీ ప్రధాన కార్యదర్శి జి.పద్మనాభయ్య పాల్గొన్నారు.

కడప జిల్లా ప్రజలు కపటం లేనివారు

బద్వేలు అర్బన్ : కడప జిల్లా ప్రజలు కపటం లేనివారని జిల్లా విశ్రాంత ఉప విద్యాశాఖాధికారి జి.ఎల్లారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మొల్ల సాహితీపీఠం ఆధ్వర్యంలో సేవా పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కడప జిల్లాలో వివిధ హోదాల్లో పదేళ్లకు పైగా పనిచేశానని, ఇక్కడి ప్రజలు ఇతర జిల్లాల నుంచి వచ్చిన అధికారులను గౌరవిస్తారని అన్నారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడి



నువ్వులు అందజేస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ

మైదుకూరు : నువ్వు పంట సాగులో విత్తన శుద్ధి తర్వాతనే పొలంలో విత్తనం వేయాలని, ఇలా చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం కేవీకేలో ప్రథమ శ్రేణి ప్రదర్శనలో భాగంగా నువ్వు పంట సాగుపై రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ నువ్వు పంటలో విత్తన శుద్ధి, సాగు, ఎరువులు, యాజమాన్య పద్ధతులను వివరించారు. వేరుశనగ, మినుము పంటల సాగులో యాజమాన్య పద్ధతులను తెలిపారు. శాస్త్రవేత్త శ్రీవిద్యారాణి మాట్లాడుతూ నువ్వు సాగులో పురుగు మందులు, ఎరువుల యాజమాన్యంపై రైతులకు సూచనలు చేశారు. ఉద్యాన శాస్త్రవేత్త ఫిరోజ్ హుస్సేన్ పసుపు, అరటి, కూరగాయల సాగులో యాజమాన్య పద్ధతులపై, శాస్త్రవేత్త బీఎస్ కాంతిశ్రీ కూరగాయాల్లో విలువ ఆధారిత పదార్థాలపై మాట్లాడారు. మైదుకూరు, బ్రహ్మంగారిమఠం, చాపాడు మండలాలకు చెందిన రైతులకు ఎకరాకు 2.5 కిలోల చొప్పున వైఎల్ఎం 146 రకం నువ్వులను, ఒక లీటర్ పెండిమెథలాన్ కలుపు మందును పంపిణీ చేశారు.

రేపు తొగటవీర విద్యార్థులకు ఉపకార వేతనాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రీమత్ పెద్ద అహోబిళక్షేత్ర తొగటవీర క్షత్రియ సేవాసంఘం వారి అన్నసత్రం ఆధ్వర్యంలో పేద తొగటవీర విద్యార్థులకు రూ.22 లక్షలు ఉపకార వేతనాలను ఆదివారం అందించనున్నట్లు అన్నసత్ర కమిటీ అధ్యక్షుడు పల్లా శేషయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక తమ కార్యాలయంలో ఉపకార వేతనాల పంపిణీకి సంబంధించిన ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో పలు సేవాకార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఉచిత మెడికల్ క్యాంప్‌లు, ఉపకార వేతనాల పంపిణీ చేస్తున్నామని చెప్పారు. నాలుగేళ్లుగా అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఉపకార వేతనాలను అందిస్తున్నామన్నారు. రాయలసీమ వ్యాప్తంగా ఇంజినీరింగ్, మెడిసిన్, ఫార్మాడీ, అగ్రికల్చర్ చదువుతున్న 130 మంది తొగటవీర విద్యార్థులకు దాతల సహకారంతో రూ.22 లక్షల అందిస్తున్నామని తెలిపారు. జమ్మలమడుగు నాగులకట్ట వీధిలోని శ్రీ చౌడేశ్వరిదేవి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్నసత్ర కమిటీ కార్యదర్శి పల్లా శంకర్ నారాయణ, ప్రధాన కార్యదర్శి సీవీ రమణ, ఉపాధ్యక్షుడు కేసీ పుల్లయ్య, గొరిగే రామస్వామి, ట్రెజరర్ పల్లా నాగమయ్య పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

బద్వేలు అర్బన్ : భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులను ఆదుకోవాలని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి నాగేష్ పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6వ తేదీన కడప కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు.. అధికారంలోకి వచ్చి 6 నెలలు పూర్తి కావస్తున్నా స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నరసయ్య, సురేంద్ర, నరసింహులు, సురేష్ పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రి వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : శస్త్రచికిత్స చేయడంలో నిర్లక్షంగా వ్యవహరించిన జిల్లా ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు ఇలియారాణిపై చర్యలు తీసుకోవాలని చాపాడు మండలం నక్కలదిన్నెకు చెందిన శివలక్ష్మి డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ అక్టోబర్ 29న ట్యూబెక్టమీ ఆపరేషన్ కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చేరగా డాక్టర్ ఇలియారాణి ఆపరేషన్ చేసి 2 గంటల అనంతరం ఇంటికి పంపారన్నారు. అదే రోజు సాయంత్రం నుంచి వాంతులు, విరేచనాలు అవుతుండటంతో ఆస్పత్రికి వచ్చి వైద్యురాలిని కలవగా గ్యాస్ట్రబుల్ సమస్య ఉందని మందులు ఇచ్చి ఇంటికి పంపించారన్నారు. వాంతులు, విరేచనాలు ఎక్కువ కావడంతో నవంబర్ 2 తేదీ మరోసారి ఆస్పత్రికి వచ్చామని వైద్యురాలి సూచనమేరకు వృందస్కానింగ్ సెంటర్‌లో స్కానింగ్ చేయించామన్నారు. పరిస్థితి ప్రమాదకరమని వైద్యులు సూచించడంతో హైదరాబాదుకు వెళ్లి ప్రైవేటు ఆస్పత్రిలో 40 రోజులు పాటు చికిత్స పొందామన్నారు. వైద్యురాలిపై డీఎంహెచ్ఓ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపారని, మరోసారి విచారణ జరుపుతామని అధికారులు తెలిపారన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఇటువంటి సంఘటనలు జరుగకుండా ఆ వైద్యురాలు ఇలియారాణి గుర్తింపును రద్దు చేయాలని లేదంటే నిరాహారదీక్ష చేస్తానని తెలిపారు. సమావేశంలో భర్త విశ్వనాథ్, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.


అన్నదానం

పోరుమామిళ్ల: మండల కాంప్లెక్స్ ఆవరణలోని రంగసముద్రం సచివాలయం వద్ద శుక్రవారం పోలూరి సుబ్బరాయుడు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని కుమారుడు అమర్నాథ్ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ ప్రతిరోజు మధ్యాహ్నం రూ. 5 క్యాంటిన్ నిర్వహిస్తున్నామని, ఈ రోజు సుబ్బరాయుడు కుటుంబసభ్యుల కోరిక మేరకు రూ.5 లు తీసుకోకుండా వారు ఏర్పాటు చేసిన మాంసాహారాన్ని అందరికీ అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ చెంద్రాయుడు, పంచాయతీ వర్కర్స్, ఎమ్‌టీఎఫ్ సభ్యులు, యూత్ లీడర్స్, సుబ్బరాయుడు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ

టీడీపీ బద్వేలు ఇన్‌చార్జి రితీష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో రంగసముద్రం ఎంపీటీసీ రమణ రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

మహిళా విద్యకోసం పోరాడిన సావిత్రిబాయి పూలే



ప్రొద్దుటూరు క్రైం : మాట్లాడుతున్న విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.వరలక్ష్మి



బద్వేలు అర్బన్ : సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



కలసపాడు: ఉపాధ్యాయురాలను సన్మానించిన ఎస్టీయూ నాయకులు

ప్రొద్దుటూరు క్రైం : మహిళలకు విద్యను దూరం పెట్టిన సంప్రదాయాలు, సనాతన ధర్మాన్ని ధిక్కరించి పోరాడిన ధీరవనిత సావిత్రిబాయి పూలే అని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి. వరలక్ష్మి కొనియాడారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా రాణి తిరుమల దేవి డిగ్రీ కాలేజీలో సావిత్రిబాయి పోరాట జీవితంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ కులాధిపత్య భావజాలం మహిళలపై అణచివేత ఉన్న కరుడుగట్టిన సమాజంలో సావిత్రిబాయి స్త్రీలకు విద్య ద్వారానే సమానత్వం సిద్ధిస్తుందని భావించి పోరాటం చేశారన్నారు. చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ మాట్లాడుతూ మహిళా విద్యకు ఉన్న కులమతాల అడ్డుగోడలను కూల్చివేసి సామాజిక సమానత్వానికి జీజాలు వేసిన తొలి మహిళ సావిత్రిబాయి పూలే అని ప్రశంసించారు.

బద్వేలు అర్బన్ : మహిళాలోకానికే సావిత్రిబాయి పూలే ఆదర్శమని వైవీయూ పాలక మండలి సభ్యులు కొండపల్లి చిన్నసుబ్బారావు, బద్వేలు పట్టణాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నానబాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మాతా సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా శుక్రవారం పూలే ఆశయసాధన సమితి, బద్వేలు పట్టణాభివృద్ధి కమిటీ, మహనీయుల ఆశయ సాధన సమితిల ఆధ్వర్యంలో సిద్ధవటం రోడ్డులోని పూలే సర్కిల్‌లో సావిత్రిబాయిపూలే విగ్రహానికి పూల మాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల విద్యాశాఖాధికారి డి.ప్రమీలదేవి, కౌన్సిలర్ హసన్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమణయ్య, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కె.వి. సుబ్బారావు, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా, సత్తార్, అన్వర్‌బాషా, వెంకటరమణ పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో..

సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో భగత్‌సింగ్‌నగర్‌లో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలసపాడు: దేశంలో మహిళల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే అని ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఎస్టీయూ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పెండ్లిమర్రి వద్ద ఉన్న కస్తూర్బా పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను శాలువా, పూల మాలలతో సన్మానించారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో సావిత్రిబాయి జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి దేవేంద్రుడు, ఉపాధ్యక్షుడు జీసీ పుల్లయ్య, కోశాధికారి మడక సంటెయ్య, గౌరవ సలహాదారుడు నాగయ్య, కొత్తపల్లి శ్రీను, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం స్థానిక ఏపీటీఎఫ్ రీజియన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ సావిత్రీబాయి తన భర్త జ్యోతీరావుపూలేకు అండగా నిలబడి సంపూర్ణ సహకారం అందించారని, భర్త ద్వారా చదువుకొని, సమాజంలో నిరక్షరాస్యులకు ఆమె ఉపాధ్యాయురాలిగా మారి చదువు చెప్పారన్నారు. సురేంద్ర, భూపాల్‌రెడ్డి, సత్తార్, శ్రీను, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని మహిళ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక పట్టణ ప్రధాన ఎస్.సునీత, జేవీవీ సమతా నాయకురాలు అఫ్రోజ్ పాల్గొన్నారు.

చౌక దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

చాపాడు: మండలంలో 17 చౌక దుఖానాలకు ప్రభుత్వం నోటీఫికేషన్ విడుదల చేసిందని అర్హులైన మహిళలు ఈ నెల 8వ తేది లోగా దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దారు రమాకుమారి తెలిపారు. ఇంటర్మీడియర్ అర్హత కలిగి 18 నుంచి 40 ఏళ్ల లోపు వయస్సు ఉండాలని, అర్హులైన వారికి ఈ నెల 17న అర్హులైన వారికి రాత పరీక్ష ఉంటుందని, అనంతరం ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు.

ఖాజీపేట : మండలంలో 37 రేషన్ దుకాణాలకు ప్రభుత్వం నోటీఫికేషన్ విడుదల చేసింది. ఆదివారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని తాహసీల్దార్ మహబూబ్ బాషా తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆర్యవైశ్య యువజన సమాఖ్య ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్‌ను సమాఖ్య అధ్యక్షుడు గాజులపల్లె అభినయ్ ఆవిష్కరించారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త

రాజుపాళెం : సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ కత్తి వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని టంగుటూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం సైబర్ నేరాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు ప్రమాదాలు తదితర వాటిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.